# 44

# బబులోను నాశనము

## (యెషయా 47)

47వ అధ్యాయం సారాంశాన్ని Paul D. Hanson యిలా యుక్తంగా చెప్పుచున్నాడు:

> తత్వశాస్త్ర అంశాలన్నిటి సంబంధమైన దృష్టికోణాలపట్ల చూపించుచున్న దాని సహనమునుబట్టి ఇదొక గణనీయమైన అధ్యాయం కాదు. ఈ విశాల విశ్వంలో మానవుడు ప్రధానమైనవాడై యున్నాడనియు మానవాళి శ్రేయస్సు నిమిత్తము అవసరమైయున్న సమస్త విషయములకు మూలాధారమైయున్నాడను వేదుక నిమిత్తము ఆశ్రయింపదగిన స్థలం కాదు. ఇక్కడ మానవుడు సాధించిన అత్యంత సన్నిహితమైనదియు ఉన్నతమైనదియునైన కార్యసిద్ధి సూక్ష్మంగా పరిశీలింపబడుటకు గురియై సఫలీకృతమునకు అది చాలినదై యున్నట్లు గుర్తింపబడుచున్నది. నాగరికత ఇవ్వగల ఉదాత్తమైనది మరియు ఉత్తమమైన భద్రతను మరియు సంతోషమును సాధించుటకు చివరకు ఏమీ చేయలేని స్థితిలో ఉన్నదని ఇక్కడ స్వాధికారంతో చెప్పబడుచున్నది.[1]

దేవుడు అష్షూరును తొలగించినట్లుగానే శక్తిమంతమైన బబులోను సామ్రాజ్యమును సహితము తొలగించవలెనని ఉద్దేశించాడు. బబులోను దేశవాసులు పలుకుచుండిన అహంకారముతో కూడిన ఆత్మస్తుతి వారిని నాశనమునకు నడిపించుచుండినది. దేవుడు బబులోను దేశమునకిచ్చిన తీర్పును ఈ అధ్యాయం పొరబడరాని మాటల్లో ప్రకటించుచున్నది.

### బబులోను విధి: విజయోత్సవము నుండి విషాదాంతమునకు (47:1-7)

కన్యకయైన బబులోనూ, క్రిందికి దిగి మంటిలో కూర్చుండుము
కల్దీయుల కుమారీ, సింహాసనము లేకయే నేలమీద కూర్చుండుము
నీవు మృదువువనియైనను సుకుమారివనియైనను జనులు ఇకమీదట చెప్పరు.
తిరుగటిదిమ్మలు తీసికొని పిండి విసరుము
నీ ముసుకు పారవేయుము
కాలిమీద జీరాడు వస్త్రము తీసివేయుము
కాలిమీద బట్ట తీసి నదులు దాటుము.
నీ కోకయు తీసివేయబడును నీకు కలిగిన యవమానము వెల్లడియగును
నేను ప్రతిదండన చేయుచు నరులను మన్నింపను.
సైన్యములకధిపతియు ఇశ్రాయేలుయొక్క పరిశుద్ధ
    దేవుడునగు యెహోవా అని మా విమోచకునికి పేరు.
కల్దీయుల కుమారీ, మౌనముగా నుండి చీకటిలోనికి పొమ్ము
రాజ్యములకు దొరసానియని యికమీదను జనులు
    నిన్ను గూర్చి చెప్పరు.
నా జనులమీద కోపపడి నా స్వాస్థ్యము నపవిత్రపరచి
    వారిని నీ చేతికి అప్పగించితిని
నీవు వారియందు కనికరపడక వృద్ధులమీద నీ కాడి మ్రానును

మిక్కిలి బరువుగా మోపితివి.
నేను సర్వదా దొరసానినై యుందునని నీవనుకొని వీటిని ఆలోచింపకపోతివి
వాటి ఫలమేమవునో మనస్సునకు తెచ్చుకొనకపోతివి.

1 నుండి 3 వచనములలో అవమానమును కనుపర్చు చిత్రములు నివేదింపబడినవి. సౌలు మరియు యోనాతానుల గూర్చి దావీదు విలపించుచుండిన మాటల్లో చెప్పుకొంటే, "అహహా బలాఢ్యులు పడిపోయిరి!" అని వ్రాయబడియున్న విషయమును మనము చూడగలము (2 సమూయేలు 1:19బి). "కన్యకయైన కుమార్తె" (1 వచనం) తన తండ్రి మరియు సహోదరులచేత కాపాడబడును. ఇక్కడ చిత్రీకరింపబడిన దయనీయమైన దృశ్యము శీలమును బొత్తిగా కించపరచునదై యున్నది. "తిరగటి దిమ్మలతో" (2 వచనం) పనిచేయుట బానిసత్వములో అత్యంత అధోఃపతన స్థితిని సూచించునదై యున్నది.[2] "ముసుగు పారవేయుట … కోకయు తీసివేయబడుట" బబులోనుకు కలుగనైయుండిన హద్దుమీరిన అవమానమును తెలుపుచున్నది.

"నదులు దాటుట" అనగా ఒక ప్రజాసమూహము చెరగా చెదరిపోవుచుండినదని సూచించుచున్నది. "ప్రతిదండన" (*naqam*) (3 వచనం) దేవుని చర్యయై యున్నది.[3] "దేవుడు పాపమును శిక్షించకుండా తిరుగుబాటుతనమును దండించకుండా వదిలిపెట్టినట్లయితే తన పరిశుద్ధమును న్యాయవంతమునైన స్వభావమునకు తగినట్టుగా యథార్థమైనవాడై యుండలేడు" అని Elmer B. Smick గమనించాడు. ఏది ఏమైనా, "దేవుని ప్రతిదండనను ఎప్పుడైనా గాని కృప చూపించుటకు ఆయన కలిగియున్న ఉద్దేశమునకు విడిగా దృష్టించకూడదు. ఆయన ఉగ్రత గల దేవుడు మాత్రమే గాదు, కానీ ఆయన కృప అర్థవంతమైనదై యుండునట్లు ఉగ్రుడైన దేవుడై యుండవలెనని" కూడ ఆయన చెప్పుచున్నాడు.[4] ఈ ఉగ్రత యొక్క మూలమేమిటో తెలియజెప్పబడి యున్నది: "సైన్యములకధిపతియు, ఇశ్రాయేలు యొక్క పరిశుద్ధ దేవుడునగు యెహోవా అని మా విమోచకునికి పేరు" (4 వచనం). "సైన్యములకధిపతియగు దేవుడు" హెబ్రీ భాషలో *Yahweh Sabaoth* అయి యున్నది. (రోమీయులకు 9:29 మరియు యాకోబు 5:4 చూడుము.)

ఆమె తన సొంత శక్తి సామర్థ్యములచేతనే తన సకల గొప్ప కార్యములను సాధించినదనియు ఆమె స్థిరంగా నిరంతరము నిలిచియుండుననియు ఆమె అత్యహంకారముతో అతిశయించుట బబులోను యొక్క అసలు సమస్యయై యుండినది (5-7 వచనాలు). బబులోను నివాసులు పై అధికారిపట్ల గల నైతిక బాధ్యత గూర్చి ఉండవలసిన అవగాహన లేశమైనను లేకుండా, వారి చేతికి చిక్కిన చెరతో నిర్దాక్షిణ్యంగా వ్యవహరించారు.

### బబులోను పతనము: అతిశయించు అహంకారము (47:8-11)

కాబట్టి సుఖాసక్తురాలవై నిర్భయముగా నివసించుచు
-నేనే ఉన్నాను నేను తప్ప మరి ఎవరును లేరు
నేను విధవరాలనై కూర్చుండను పుత్రశోకము నేను చూడనని
అనుకొనుచున్నదానా, ఈ మాటను వినుము
-ఒక్క దినములోగా ఒక్క నిమిషముననే పుత్రశోకమును
వైధవ్యమును ఈ రెండును నీకు సంభవించును.

నీవు అధికముగా శకునము చూచినను
అత్యధికమైన కర్ణపిశాచ తంత్రములను నీవు
ఆధారముగా చేసికొనినను
ఆ యపాయములు నీమీదికి సంపూర్తిగా వచ్చును.
నీ చెడుతనమును నీవు ఆధారము చేసికొని యెవడును
నన్ను చూడడని అనుకొంటివి
-నేనున్నాను నేను తప్ప మరి ఎవరును లేరని నీవను కొనునట్లుగా
నీ విద్యయు నీ జ్ఞానమును నిన్ను చెరిపివేసెను.
కీడు నీమీదికివచ్చును నీవు మంత్రించి దాని పోగొట్ట జాలవు
ఆ కీడు నీమీద పడును దానిని నీవు నివారించలేవు
నీకు తెలియని నాశనము నీమీదికి ఆకస్మికముగా వచ్చును.

బబులోను పాపములు 8-10 వచనములలో గణింపబడియున్నవి: ఇంద్రియ సుఖాసక్తి, అహంభావ అతిశయోక్తులు, "శకునము చూచుట," "సొంత విద్య మరియు జ్ఞానముపై ఆధారపడుట," "నేనున్నాను నేను తప్ప మరి ఎవరును లేరని అనుకొనుట." అయితే దేవుడు మాత్రమే "నేను ఉన్నవాడను" అయియున్నాడు. ఈ సత్యము ఆయన మోషేతో అరణ్యములో బయలుపరచిన ఆయన వ్యక్తిగత నామములో ప్రతిబింబించబడియున్నది (నిర్గమకాండము 3:13, 14 చూడుము).

యెషయా రోజుల్లో "పుత్ర శోకము మరియు వైధవ్యము" (9 వచనం) గల స్త్రీకి కాపుదల మరియు భవిష్యత్తు కొరకైన భద్రత లభించకుండా చేయును. బబులోను యొక్క అహంకార వైఖరి ఎంతో కాలం నిలువనేరదని సూచించుటకు ఈ నిరాశాజనకమైన పరిస్థితి ఉపయోగింపబడినది, "కానీ కీడు," "అనర్థకము" మరియు "నాశనము" "నీ మీదికి ఆకస్మికముగా వచ్చును" అని దేవుడు ప్రకటించాడు (11 వచనం). దేవుని ప్రతిదండనను బబులోను నివాసులు తప్పించుకొనలేదు.

## బబులోను నాశనము: రక్షించువారెవరును లేరు (47:12-15)

నీ బాల్యమునుండి నీవు ప్రయాసపడి అభ్యసించిన నీ
కర్ణపిశాచ తంత్రములను
నీ విస్తారమైన శకునములను చూపుటకు నిలుపుము.
ఒకవేళ అవి నీకు ప్రయోజనములగునేమో
ఒకవేళ నీవు మనుష్యులను బెదరింతువేమో
నీ విస్తారమైన యోచనలవలన నీవు అలసియున్నావు
జ్యోతిష్కులు నక్షత్రసూచకులు మాసచర్య చెప్పువారు నిలువబడి
నీమీదికి వచ్చునవి రాకుండ నిన్ను తప్పించి రక్షించుదురేమో ఆలోచించుము.
వారు కొయ్యకాలువలెనైరి అగ్ని వారిని కాల్చివేయుచున్నది
జ్వాలయొక్క బలమునుండి తమ్ముతాము తప్పించుకొనలేక యున్నారు
అది కాచుకొనుటకు నిప్పుకాదు ఎదుట కూర్చుండి కాచుకొనదగినది కాదు.
నీవు ఎవరికొరకు ప్రయాసపడి అలసితివో వారికి అలాగే జరుగుచున్నది
నీ బాల్యము మొదలుకొని నీతో వ్యాపారము చేయువారు
తమ తమ చోట్లకు వెళ్లిపోవుచున్నారు
నిన్ను రక్షించువాడొకడైన నుండడు.

బబులోను వాసులు మంచి "జ్యోతిష్కులు" అని వారికి ప్రాచీన ప్రపంచంలో గొప్ప పరపతి ఉండినది. భూలోకమందు సంభవించుచుండిన సంఘటనలు నాకము నందలి నక్షత్రాదుల కదలికల చేత నిర్ణయించబడినవను వారి వాదనను కాపాడుకొన్నారు. అంబర వీధిలోని అందాల నక్షత్రాదుల కదలికలను అధ్యయనము చేయుటకు వారు రాశి చక్రములకు సంబంధించిన సంకేతములను అభివృద్ధి చేసారు. వారి పరిశీలనముల ఆధారంగా, వారు సంఘటనల పరంపరల గూర్చిన జోస్యములు చెప్పుచుండిరి. 12 మరియు 13 వచనములలో కొన్ని మాటలు వ్యంగ్యంగా చెప్పబడుచున్నట్లు గమనించనగును: "... నీ విస్తారమైన యోచనలవలన నీవు అలసియున్నావు; జ్యోతిష్యులు నక్షత్ర సూచకలు, మాసచర్య చెప్పువారు, నిలువబడి నీమీదికి వచ్చునవి రాకుండ నిన్ను తప్పించి రక్షించుదురేమో ఆలోచించుము." ఈ నేర్పరితనములను అభ్యసించువారు "కొయ్యకాలు వలె అయ్యారు" గనుక వారు కాల్చివేయబడుదురు, "జ్వాల యొక్క బలమునుండి తమ్మునుతాము తప్పించుకొనలేదు" (14 వచనం).

గనుక బబులోను విషయంలో "నిన్ను రక్షించువాడొక్కడైనను ఉండడు" అనునది తుది అభిప్రాయమైనది (15 వచనం). జీవముగల దేవునియందు తప్ప మరి ఎవరిలోనైనను లేక దేనియందైనను నమ్మకముంచువారందరి గతి కూడా ఇంతే!

---

సూచనలు

[1]Paul D. Hanson, *Isaiah 40-66*, Interpretation: A Bible Commentary for Teaching and Preaching (Louisville: John Knox Press, 1995), 120. [2]John N. Oswalt, *The Book of Isaiah, Chapters 40-66,* The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1998), 242. [3]ద్వితియోదేశకాండము 32:35; రోమీయులకు 12:19; హెబ్రీయులకు 10:30 చూడుము. [4]Elmer B. Smick, in *Theological Wordbook of the Old Testament*, ed. R. Laird Harris, Gleason L. Archer, Jr., and Bruce K. Waltke (Chicago: Moody Press, 1980), 2:599.

---

## వాక్యభాగాన్ని బోధించుట

**ఎడ్డీ క్లోయర్**

---

### ❖❖❖ పాపమునకు తీర్పు తీర్చబడును ❖❖❖
### (అధ్యాయం 47)

"బబులోను" అవిధేయుతకును దుర్మార్గతకును ఒక చిహ్నముగా నిలుచుచున్నది. ఒక కోణంలో చూచినట్లయితే, అది దేవుని యెడల కలిగియున్న ప్రతిఘటనకంతటికిని ప్రతినిధియై యున్నది. బాబెలు యొద్ద (ఆదికాండము 11:1–9) మనము తిరుగుబాటును గమనించగలము. ప్రపంచమంతటిని తన గుప్పిట్లో ఉంచుకొనగల ఒక శక్తియైయుండిన బబులనులో, గర్విష్ఠితనమును మరియు ధిక్కారమును చూడగలము. ప్రకటన గ్రంథంలో, బబులోను అను పేరు రోమా పట్టణమునకు ఉపమానాలంకార బిరుదై యున్నది. అది క్రైస్తవ విశ్వాసులను అత్యధికంగా హింసించుచు దేవునికి విరోధియైన ప్రత్యర్థిగానుండుటకు

ప్రయత్నించినది.

దేవుని నీతియుక్తమైన ఉద్దేశములలో, బబులోనుకు తీర్చబడిన తీర్పు యుక్తమైనదే. దేవుడు కృపాకనికరములుగల దేవుడైయున్నాడు. ఆయన బోధపరుస్తాడు, హెచ్చరిస్తాడు, వేచియుంటాడు, మరియు ఆహ్వానిస్తాడు; ఏదిఏమైనా, ఎట్టకేలకు ఆయనలో యిక సహనము మిగిలియుండదు. ఆయన సమయం వచ్చినప్పుడు, ఆయన ప్రతి ఒక్కరిని, ప్రతి పట్టణమును మరియు ప్రతి దేశమును తన తీర్పు సింహాసనము యెదుటికి పిలుచును.

ఈ అధ్యాయం ఒక విధంగా బబులోను కొరకు ముందుగానే ఏర్పాటు చేయబడిన అంత్యక్రియల నమూనాయై యున్నది. ఈ దౌష్ట్య పట్టణము మరియు సామ్రాజ్యము గూర్చి విధిలిఖితమైయున్న దానిని చూచుటకు దేవుడు చదువరిని అనుమతించుచున్నాడు. దేవుడు తన శాసనమును జారీచేయుటకు బబులోనును ఉపయోగించుచున్నంత మాత్రాన బబులోను ఆయనకు లెక్కలు ఒప్పజెప్పవలెనని దానిని అడుగకుండా అది ఆయనను వారించజాలదు.

బబులోను పాపము యొక్క శక్తికి లొంగిపోయి తన హృదయములో దానికి చోటిచ్చినది. అది దాని యజమానితో ఏకమయ్యింది; ఈ విధంగా పాపము యొక్క ఖండన భయభీతిని కలిగించుచు తిరిగి పొందుకొనలేని బలముతో బబులోను మీదికి వచ్చును. పాపమునకు తీర్పు తీర్చబడినప్పుడు, దాని స్వభావము, అంతిమ గమ్యము, మరియు నిరంకుశత్వము ప్రధానంగా కొట్టొచ్చినట్లు కనబడజేయబడును.

*దేవున్ని ధిక్కరించుట వలన చివరకు అవమానము పాలౌదుము.* బబులోను, లోకములోని అతి గొప్ప సామ్రాజ్యము, దేశములన్నియు ఈర్ష్యచెందుచుండిన దేశమై యుండినది; కానీ దేవుని సమయము వచ్చినప్పుడు అదొక బానిసయగును. అది చాలీ-చాలని వస్త్రములు ధరించియున్న, నీచమైన బానిసయగును (1-3 వచనాలు)! శక్తిశాలియైన బబులోను ఎంపికచేసికొన్న మార్గము చరిత్రలో ఆమెకు కలవరము కలిగించు స్థాయికి ఆమెను తీసికొనివచ్చును.

*పాపము ఏమైయున్నదను విషయము చివరకు బట్టబయలు చేయబడును.* పాపము మరియు స్వార్థము, స్వాతిశయము నుండి పుట్టిన విధ్వంసకరమైన శక్తియైయున్నది. అది ప్రజలను దాని చెడు పన్నుగడలకు బానిసలనుగా చేయుట ద్వారా వారిని స్వార్థము నిమిత్తము వాడుకొంటుంది. లాలసత్వమును అది తానే అతిగా అనుభవించవలెనని ఆశిస్తూ స్వప్రయోజనమును వెదుకుచుండును, అది ధౌర్జన్యపూరితమైనది మరియు హానికరమైనది. చెడ్డదైన పుట్టకురుపువలె, అది మనిషిని సంహరించి సర్వనాశనము చేయడానికే జీవిస్తుంది.

*పాపము యొక్క బలము ఖండిస్తుంది, కానీ రక్షింపజాలదు.* అది అజేయమైనదని బబులోను అనుకొన్నది, కానీ పాపము ఎన్నటికినీ అభేద్యమైనది కాదు. పాపము ఈ లోకములో అత్యంత సులభంగా జయింపబడగల శక్తియై యున్నది. "... ఒక్క దినములోగా ఒక్క నిమిషముననే పుత్రశోకమును వైధవ్యమును ఈ రెండును నీకు సంభవించును. నీవు అధికముగా శకునము చూచినను, అత్యధికమైన కర్ణపిశాచ తంత్రములు నీవు ఆధారముగా చేసికొనినను ఆ యపాయులు నీ మీదికి సంపూర్తిగా వచ్చును" అని ప్రవక్త చెప్పుచున్నాడు (8, 9 వచనాలు). ఇంకా, "... నీ విద్యయు నీ జ్ఞానమును నిన్ను చెరిపివేసెను" అని కూడా చెప్పుచున్నాడు (10 వచనం). వచ్చిన కీడును అవి "మంత్రించి" పోగొట్టజాలవు (11 వచనం). దేవుడు తీర్పు తీర్చి దానిని అమలు చేయునప్పుడు, బబులోనులోని ఏ శక్తియైనను దానిని

భయపెట్టి నివారించజాలదు.

*పాపము సంపూర్తి నష్టాన్నే కలుగజేస్తుంది తప్ప దాని వలన ప్రయోజనమేమియు ఉండదు.* దానిని నమ్ముకొని దానికి తమ్ము తాము అమ్ముకొనిన వారిని అది నాశనం చేస్తుంది. పాపము వలన వచ్చు జీతము మరణము (రోమీయులకు 6:23 చూడుము). బబులోను దేవుని యెడల చూపించిన ధిక్కారము గూర్చి మాత్రమే అది జ్ఞాపకముంచుకొనబడినదై, చరిత్ర పుటల్లోనుండి చెరిపివేయబడును. “రాజ్యములకు దొరసానియని యిక మీదట జనులు నిన్ను గూర్చి చెప్పరు” అని ప్రవక్త చెప్పుచున్నాడు (5 వచనం). కీడు మరియు తెలియని నాశనము ఆకస్మికముగా వచ్చిపడుటకు కాచుకొని యున్నవి (11 వచనం).

పాపముతో పోరాడుట అంత సులభంకాదని బబులోను అతి కష్టంగా గ్రహించాల్సి వచ్చింది. పాపముతో సహవసించువారు అవమానమునకును, సంపూర్తిగా బట్ట బయలగుటకును, ఖండనకును, మరియు బొత్తిగా నష్టపోవుటకును ఎదురుచూడవలసి యుండును.

బబులోను గూర్చిన భయంకరమైన తీర్పు, ఈ అధ్యాయంలో గల చర్చనీయాంశమై యున్నది. దేవుడు బబులోనును ద్వేషించలేదు; ఆయన ఇతరులను ప్రేమించుచున్నట్లుగానే దానిని కూడ ప్రేమించాడు. బబులోను ఒక ఎంపిక చేసికొన్నది, ఆమె చేసికొన్న ఆ ఎంపికయే ఆమె విధిని నిర్ణయించినది.

## వాక్యభాగాన్ని వివరించుట

**నీల్ ప్రయర్**

### ❖❖❖ బబులోను కొరకు విలపించుట ❖❖❖
### (47:1-15)

యెషయా 47వ అధ్యాయం బబులోనును సిగ్గుపరచబడనైయున్న ఒక కన్యకగా చిత్రీకరించుచు, దాని గూర్చినొక విలాపమైయున్నది (1 వచనం). “... నీవు మృదువువనియైనను సుకుమారీవనియైనను జనులు ఇకమీదట చెప్పరు” అని మొదటి వచనం చెప్పుచున్నది.

వారు అజేయులని బబులోను నివాసులు అనుకొన్నారు. వారికున్న నానావిధ కళల ద్వారా వారు భవిష్యత్తును ముందుగానే తెలియజెప్పగలరని నమ్మారు, కానీ వారి శకునములు మరియు మంత్ర విద్యలు కేవలము నిష్ప్రయోజనమైనవే అని యెషయా వ్యక్తము చేసాడు (8-14 వచనాలు). “నక్షత్రములు” మరియు “నెలవంకలు” ఆధారంగా వారు కర్ణపిశాచ తంత్రములు, యోచనలు, జోస్యములు చెప్పుచుండినప్పటికిని, “నిన్ను రక్షించువాడొకడైన నుండడు” అనునది దేవుని సందేశమైయుండినది (15డి వచనం).

హెరోడోటస్, మతసంబంధమైన ఒక చరిత్రకారుడై క్రీ.పూ. 400 సంవత్సరములో జీవించినవాడు చెప్పుచున్న దాని ప్రకారము బబులోను ఒక్క రాత్రిలోనే పతనమైనది. యూఫ్రటీసు నది బబులోను కోట గోడల వరకు ఒక ప్రళయంగా ప్రవహించినది. వారు

ప్రయాసపడకుండానే పట్టణములోనికి మొలబంటి లోతు నీళ్లలో ప్రవేశించగలుగునట్లు పారసీక సైనికులు అట్టి ప్రవాహ మార్గమును దారి మళ్లించారు. బబులోను పట్టణస్థులు గోపురముల పైనుండి కాపలా కాయుచుండగా, వేలాది మంది కోరెషు సైనికులు వారి క్రిందుగానే పట్టణములోనికి ప్రవేశించారు.